మళ్ళీ ఆ తెగవాళ్ళ పుట్టుపూర్వోత్తరం యోజించసాగినాను. "ఆకాశం తండ్రి, భూలోకం తల్లీ ఆ రెండుకలిసేచోటున వాళ్లు ఉద్భవిల్లుతూ ఒకపేనడక ఒకపేనడక ఆ సూర్యచంద్రుల్లాగు ఒకపేనడక నడుస్తూ పోతారు. వాళ్ళకేమిటి? స్వేచ్ఛ! వాళ్ళప్రేమ చెట్టునీడనూ, నదీతీరాన్ని, వెన్నెట్లోను, చీకట్లోను విరిసి నృత్యచేస్తూవుంటుంది. వాళ్ళ నొకళ్లు కనిపెట్టడానికి శక్యమా? పదివేలమంది రక్షకభటులున్నాగానీ రక్షకభటులు లేనివాళ్ళే" అని అలాఅనుకుంటూ స్వేచ్ఛగా నిద్రపోయినాను. నిద్రలో స్వేచ్ఛగా కలగన్నాను. నిద్రే రక్షకభటుడు. స్వేచ్ఛగా గన్న నాకలే "సుకారీ, లంబాడీ, మరాటీ"—

.... .... .... .... ....

## పైడయ్యా దరిద్రదేవత

అక్కడకు నాలుగైదు సంవత్సరాలనుంచి పెద్ద గోదావరి, అంటే వంతెనకు దిగువ ఆనకట్టు కెగువనున్న విశాలమైన నీటి ప్రవాహము, వఱద రోజుల్లో కొత్తదారిపట్టి తూర్పుకట్టు కోస్తూ నట్టేట పెద్దపెద్ద ఇసకమేటలు వేయడం రివాజు అయిపోయింది. తుదకు నిరుడు అల్కట్టుతోట కెదురుగుండావున్న పోతగట్టు తెగ్గొట్టుకు పక్కనున్న మాలగూడెమ్మీద పడిపోతుందా అన్నంత అలజడి కలగజేసింది. కాని ఆ ఒడిచుట్టు తప్పింది. "ఈకోతను పుచ్చుకుచూస్తే మేటెక్కడ వేసివుంటుందా" అని అప్పట్లో యోజిస్తే ఎక్కడవేసివుంటుందో ఎవరూ చెప్పలేకపోయినారు కాని గోదావరితీత ప్రారంభించేసరికి కాకినాడ కాలవమొగ ధవళేశ్వరం దగ్గఱది పూర్తిగా కప్పడిపోయింది. పడవలకు

దారిలేదు. చేలకు నీరులేదు. లక్షరూపాయలకుపైగా అవుతుంది ఆ ఇసక తవ్వు అని పెద్దపెద్ద ఎంజినీర్లు అంచనావేసి టెండర్లు పిల్చి కంట్రాక్టరు కిచ్చి తవ్వు 1934 తొలకరించకుండా పూర్తి కావాలన్నారు. కంట్రాక్టరు క్రిందా మీదా పడి జల్లిసీమనుండి సింహాచలంవరకూ వున్న కూలీలను అయిదారువేల మందికి కుంట 1-కి మూడణాలు కూలిస్తామని లేవదీసుకువచ్చి ధవళేశ్వర మంతా కూలీలమయంచేసి పారేశాడు. ఒక్క అయిదార్నెల్లు.

1934 మేనెల వచ్చింది. ఇసకతవ్వు అఖరయింది. ఇక రాయిపరవడం తరువాయి. ఆపని బంటావాళ్ళది కాదు. అంచేత ఆనాటి తెల్లవారగట్ల బంటావాళ్ళంతా మతోచోట పనిచూచుకోవ డానికై పోవాలని అనుకొంటూవున్నారు.

అపరాహ్నం రెండుగంటలప్పుడు. ఎండ తీవ్రంగా గాస్తూ వుంది. బంగనబయలున ఆ కూలీలు ఏలాపడితే ఆలా అడ్డదిడ్డంగా వేసికొన్నవి తాటాకువి. అమ్మోర్ని వీధిలో నిలిపేటప్పుడు వేసే పాకలాంటి నమోనాను వేయబడ్డవి—ఇఖ మర్నాడు ఖాళీ, "ఆపని వాళ్ళంతా వెళ్ళిపోతారు. ఆడవాళ్ళు, మగవాళ్ళు, పిల్లలుఅంతా వెళ్ళిపోతారు. ఊరు చిన్నపోతుంది" అనుకొంటున్నారు కొందరు కొందరు గ్రామస్థులు చెట్లక్రిందకూర్చొని—కాదుమతీ—ఊరికి జనసంఖ్య ఎక్కువగా ఉండడం ఒకనిందు అందులోనూ పని పాటలుచేసికొనే పాటకపుజనం పొరుగూరువాళ్ళు చాలామంది వచ్చివుంటే అదో వింతకూడాను. ఎక్కడెక్కడి ఆడవాళ్లు ఎక్కడెక్కడి మగవాళ్ళు ఒకళ్ళ మొగాలొకళ్ళంతక్రితం ఎరుగుండని వాళ్ళంతా ఊళ్లోవాళ్ళతో ఏకమైపోయి అక్కడ కైదార్నెల్లనుంచి కలిసిమెలిసి తిరుగుతూ చటక్కున

ఓ తెల్లవాఱుగట్ల—నేనంతా దేరాలు విడిచిపెట్టి వెళ్ళిపోయినట్టు—వెళ్ళిపోవడం అంటే అందరికీ అదోకించగా ఉండకమానదు. వాళ్ళకోసమని నిజంగా కొన్నికొన్ని కొత్తకొత్త మిఠాయి దుకాణాలు, కొన్నికొన్ని కొత్తకొత్త కల్లంగళ్లు, కొన్నికొన్ని కొత్త భజనమందిరాలు, కూడా బయలుదేరినవి. అవన్నీకూడా మర్నాడునుంచి ఎత్తిపెట్టివేయవలసిందే! నూతిదగ్గఱ నీళ్ళు తోడేచోట వాళ్ళమూలంగా 60, 70, కుండలు ఉత్తవి ఎప్పుడూ వంతులుతెగక తోడుకోడానికి చోటులేక వుండిపోతూవుండేవి. మర్నాటినుంచి ఆ సందడిఅంతా చెల్లు.

అటువంటి పరిస్థితిలో పైడయ్యాగాడనే బంటావాడు ఎక్కడికో పోవాలనుకుంటూవున్నాడు. పోవాలనుకుంటూ గుడిసె ఇవతలకువచ్చి ఆకాశంకేసి చూచేడు. "ఓరబ్బో! ఏం ఎండ! మండుకుపోతూందే!" అనుకొన్నాడు. గుడిసె యీవలవున్న తన గునపంమీద చెయ్యివేసి చూచేడు. "ఓరమ్మో! చుర్రు మంటోన్నాది, కొలిమిలో ఎఱ్ఱమడ్డాదానికి మల్లే: ఊః" అనుకొన్నాడు.

"ఎన్నాళ్ళపాటద్ద యీగునపమే మిగులు
ఎందుకుర యీజన్మ మోరన్నా!
కంటరాక్టరు మేడ కలకచేరు ఓడ
కట్టుకుని ఎంచక్క సౌఖ్యపడుతూవుంటే
ముందూరు ఏదంటు మోసపోయేమనకు
ఎందుకుర యీ జన్మ మోరన్నా!"

అని పాడుతూ దిక్కులు చూచేడు.

గవళ్లోరి ఆడపడుచు పాశాలమ్మ కుఱ్ఱగుంట పదారేళ్ళది—ఆకుజోడు కాళ్ళను, ఈడిముంత చేతను—ఆ పాట వినో వినకో

వరసకు "పయిడయ్యా బావా : తెల్లాఅగట్ల వెళ్ళిపోతారు కామోసు" అంది. పయిడయ్యి చూచేడు కళ్లెత్తి. తనఒళ్ళూ తానూ మఱచి పోయినాడు.

" ఎండసెగలూ చెఱుగుతున్నా
ఈడిముంతకు వేడిలేదు :
కల్లుముంతకు కాక లేదు :
గవళ్లోరి పాశాలమ్మ
కళ్ళచలవకు తిరుగులేదు. "

అని పదమ్మార్చి గట్టిగాపాడి "వెళ్ళేముందు నీక్కాన మదే వెడతానో మఱదలా !" అన్నాడు. "అయితే నివ్వొచ్చే దాకా కూకుంటాను చెప్పునరా !" అంది.

గవళ్ళపాశాలమ్మ ఊరికి దూరంగా తూర్పుగావున్న ఓ తాళ్ళముసుగులో జొఱబడిపోయింది. ఓ ఘడియ అటూఇటూ పయిడయ్యా చూచేడు. ఆకాశం పడమటవైపు బొబ్బర్లంక ఆశాయల ఉరిమినట్టు వినవచ్చింది వాడికి. "ఓరయ్యో, ఉఱుముతోన్నట్టుంది ఆకాశం." అని ఏటిగట్టెక్కి చూచేడు. మఱోనిమిషానికి దూరాన్నే ఇసక లేస్తోంది రంయిమంటా— మేఘాలు, నాటకరంగమ్మీద తెరలు పైనుంచి కింద కెంత గబ గబా దిగజారతాయో అంతగబగబా అవి క్రిందనుంచి పైకి వన్నె వన్నెల్తో లేచిపోయినాయి. లేచిపోయి క్రమేణా ధూమ్రవర్ణం లోంచి నల్లనల్లగా మాఱి కాఱునల్లనై చల్లని గాలితో ప్రాకి పోయినాయి. గోదావరి నీరంతా ఓవైపు ఆకుపచ్చనచాయగా మాఱిపోయింది, రెండోతట్టు కొంతసేపు ఉత్తరపుదెస సూర్య కాంతిని ప్రతిఫలించి అట్టే అదికూడా మాయంజేసివేసింది. అంతా ప్రళయమేఘ ఝంఝూమారుతమయమై పోయి కళ్ళల్లో ఇసకా,

దుమ్మూ కొట్టడం ప్రారంభించింది. పయిడయ్య వెనక్కు తిరిగి మళ్ళీ వూళ్లో పడేసరికి వెనకనుంచి ఎదో పెనుభూతంచెయ్యేట్టి తోసేస్తూ వున్నట్టు పెద్దగాలి రింవురింవు కొట్టసాగింది. పయిడయ్య తనగుడిసె చెంతకు వచ్చేసరికి గుడిసెమీదవి ఆకు లైదారెగిరిపోయినయి. ఉన్న నాలుగాకులుమీద అంతంత చినుకు టపటపా పడుతూవుంది. వడగళ్లకూడానేమో అని అనుకొన్నారు కొందఱు. ఇంకా మేఘం కమ్ముకుపోతూవుంది. చీకటి అయోమయం అయిపోయింది. ఇళ్లల్లో దీపాలుపెడితే ఉండడంలేదు. తలుపులు ధముధిము కొట్టుకోవడం మొదలుపెట్టి కొన్నికొన్ని వాటంతటవే చిలకలుపడిపోయి సద్దణగి పోసాగినయి. సావిళ్ళు బూజుతో, రోడ్డుమట్టితో నిండిపోయినాయి. రంయిని ఆకాశం మెఱుస్తూ డబడబా ఉఱిమితే ఒకమూల కొదిగిపోయి అమ్మమ్మలు "అర్జునః ఫల్గుణః పార్థివః" అంటూవుంటే కుఱ్ఱవాళ్ళు దానికో దీనికో ఉలికిపడిపోవడం నాలుగైదుసార్లు జరిగింది. మోటర్ల కోసమని వేసిన టిన్‌రేకుషెడ్డులు ఎగిరిపోయి మోటారుకార్లు తడిసిపోయినయి. కొబ్బరాకు మట్టలూ బొబ్బాసి గొట్టాలు ఎగిరి ఎగిరి సరిగా సైడుకాల్వలలో పడి నీటిప్రవాహాలకు అడ్డుకుని నీరంతా రోడ్లు ముంచేసేటట్టు చేసివేసినయి. ఇక పడిపోయిన దడులకు, కూలిపోయిన గోడలకు, ఎగిరిపోయిన బళ్ళగూళ్ళకు, పరుగులెత్తిన పశువులకు లెక్కలేదు. ఒక్కనిమిషంలో తాఱుమారైపోయింది ప్రకృతి. ఒకగంట క్రితం ఎంత ఎండ అనిపించిందో గంట అయినతరువాత అంత చలి అనిపించ సాగింది.

కూలీలంతా తమగుడిసెలమీద ఆకు లెగిరిపోయిన కొద్దీ ఇక గుడిసెల్లోవున్నా వొకటే ఈవల నించున్నా వొకటే అని

ఎంచుకొన్నవారై ఇవలకువచ్చి "అరి! కూళ్లవందుకు ఒక కునుకుతీసి వెళ్ళిపోదాం అనుకుంటూంటే ఇంతలోకే ముంచు కొచ్చింది ముండా గాలిదుమారం." అని ఒకళ్ళకేసి వొకళ్ళు ఒక్కొక్కమాటు చూచుకుంటూ అందరూకలిసి ఆకాశంకేసి చూడసాగేరు. వాన ఆగేఎత్తుగాని గాలి మానేసూత్రంగాని ఔపించడంలేదు. పయిడయ్యకూడా అందరితో ఇవతలకువచ్చి "ఏంటర్రా! అలా పరకాయిస్తారు. మన కేముందని? గునపాలు బుజాన్ని వేసికొని ఏసత్రపు పంచకో పోదాం నడుండి" అన్నాడు. "నీకేం సెబుతావు—పిల్లలు గలాళ్ళం, పెళ్ళాలు గలాళ్లము మేం నీలాగు ఇట్టేలేచిపోలేం" అన్నాడు బసవయ్య అనే మతో బంటావాడు. "అయితే మీరు నిదానించుకురాండి. నేపోతా" నన్నాడు పైడయ్య. అని తన గునపం బుజాన్ని పెట్టుకొని "ఓరి! దీన్ని తగలెయ్య. ఇగమైపోయింది ఈ కాస్సేపట్లో" అని అనుకొంటూ తడిసిపోయ్ని గోచీతోనే నడవసాగేడు—"ఉండరా! మేమూవస్తాం" అని కొందరు తోడికూలీలు అంటూవున్నాగానీ—బసవయ్య "వాడి చూపు వేఱు. పోనియ్యండి గాడిదకొడుకుని" అని సణుక్కున్నాడు, కుర్రుగాచూసేడు పైడయ్యకేసి. పైడయ్య వీణ్ణీ వినిపించుకో లేదు. ఖిన్నంగా తాళ్లముసుగులోకి పైడయ్య వెళ్లేడు—సత్ర ప్పంచకూకాదు, చలివేంద్ర పంచకూకాదు.

పైడయ్య తాళ్లముసుగులోకి వెళ్లేతలికి గాలియొక్క ఉధ్రుతం చాలామట్టుకు తగ్గిపోయింది. జీమూతంగా మబ్బులింకా కమ్ముకుపోతూ జ్జోరుగా వానమాత్రం కురుస్తూవుంది మధ్య మధ్య ఓమాటు అగుతూవచ్చినా పైడయ్య ఆ తాడిచెట్టు

ఆ తాడిచెట్టు చాటునా మాటునా తాను నిలవడమేకాకుండా తన లాగే ఆ చెట్టు అవల పెడ ఒదిగి గవళ్ళది తనకోస మెదురు చూస్తూందేమోనని చెట్టుచుట్టూ తిరిగేవాడు.

క్రమంగా వానతగ్గింది. ఒక్కసారిగా పడమట దిక్కంచు తెలిపియిచ్చిందేమో గభీమని తాటిచెట్లమీదకు ఈ ఎండ పక్షి వ్రాలినట్లు వ్రాలింది. "ఇంకా ప్రొద్దుకూకలే" దనుకున్నాడు పయిడయ్య. ఆఖరుసారి అకాశాన్నంతా కౌగిలించుకు మఱీ వెళ్ళిపోదామని సూర్యుడనుకొన్నట్టుగా ఒక్కసారి ఎర్రెర్రగా రంగు తూర్పునకంటాకూడా ఎగచూపించి కుంకిపోయినాడు. "ఓసి! అప్పుడే కుంకిపోయిందే పొ" ద్దనుకున్నాడు పైడయ్య. పక్షులు—గోరింకలేమిటి, చిలకలేమిటి, కాకులేమిటి, కొంగ లేమిటి—అన్నీ కిలాకిలారావాలు చేస్తూ ఇవతలకువస్తూ లోపలకు పోతూ చెట్లశిరాలచుట్టూ తిరుగుతూ పెద్ద సందడిచేశాయి. ఆ సందడి ఎంతోసేపువిన్నాడు పయిడయ్య. ఎక్కడా ఆ సంద డిలో పాశాలమ్మ గాజులు చప్పుడు కాలేదు. "అరే ఈ వానకు గాలికి జడిసిపోయి వెళ్ళిపోయింది లాగుందే! కడసారి దాని చేతికల్లు కాసంతతాగి, ఓమాటుతూగి దానివొళ్ళో ఉయ్యాలూగి మఱీ పోవాలనుకుంటే సాగిందికాదుకందా! దిక్కుమాల్ని గాలి దుమారం—" అయితే నివ్వొచ్చేదాకా కూకుంటాను. చప్పునిరా" అంది—చప్పునే వచ్చాను—కూకుందికాదే! నే వచ్చేదాకా?" అని ఇలా పరిపరివిధాల వగలుపోయినాడు.

తాటిచెట్ల మువ్వలుకేసిచూచినాడు. లొట్టిలన్నీ. వేలపడి పోయి కొన్నీ, కిందపడిపోయి కొన్నీ చిన్నబోయి కనిపించేయి! ఓజాము ఏమీతోచక తిరిగాడు తిరిగాడు, ఇక తిరగలేక ఒకచోట

తన బుజాన్నివున్న గునపం నేలను దిగేసి విశ్రమిద్దామను కున్నాడు. అనుకొని చతికిలబడ్డాడు, గరపనేలా కాసంత తెలుపి నేలా చూసుకొని.

వాడూ చతికిలపడేసరికి నది ఆకాశంకూడా బొల్లిచ్చి చంద్రుణ్ణి వెలిబుచ్చింది. చూచేడు పయిడయ్య పైకి—"వహ్వా!

" దివిజల్లు భువికొస్తె - భువికల్లు దివికెళ్ళి "

అని బాడేడు. పాడి తనపాట కనుశ్రుతిగా విన్నాడు.

" కల్లుకుండా చుట్టు - కల్లు నురువేసూడు
దివిలోన భువిమీద - మూతికాడే కట్టు
పయిడయ్య బావా! - మూతికాడ కట్టు
పయిడయ్యబావా!"

చుట్టూచూచేడు. గవళ్ళ పాశాలమ్మ ఆ కుబ్బగుంట గొంతల్లే వినబడ్డది. జాడకూడా మాపుల్లోపడ్డది. "ఓమఱదలా ఆ కాడ రుప్పలో దొప్పవుంది. నా దొప్పవుంది తెచ్చిపెట్టు" అన్నాడు గట్టిగా. "వెన్నెల్లో వెండిదొ"ప్పంటూ పట్టుకొస్తూ వుంది జవ్వని—జవ్వని చేతిలో లొట్టిలేదు "లొట్టిలేందే దొప్పెం దుకు? పాశాలమ్మా! లొట్టుచ్చుకురా" అన్నాడు పయిడయ్య. జవ్వని దొప్పపారేస్తూ బాగా దగ్గఱకొచ్చి "లొట్టిలన్నీ పగిలి పోయినయి. ఈయేళ. పయిడయ్యబావా! ఎంతఒట్టు పెడితే అంతఒట్టు" అంది. "గాలికి నిట్టతాళ్ళన్నీ ఊగిసలాడిపోయి డీడిక్కుఱుకొట్టుకుంటే కామోసు పిల్లా!" అన్నాడు పైడయ్య. "అయితేం. వెన్నెలపక్కేఱశావు!" అంది జవ్వని. "వెయ్య డమే కాదు. చందురుడిలో నలుపంతా భాండంగా కనిపిస్తే నలుపు చుట్టు తెలుపంతా నురువులాగు పొంగివుంటే.

నిన్నందిపుచ్చుకోమంటున్నా పాశాలమ్మా!
నీవంది పుచ్చుకు వడ్డిస్తే పాశాలమ్మా!
దోసిటతో నా దోసిడాతో

తాగబోతువున్నానే పాశాలమ్మా !
లొట్ట లేస్తువున్నానే పాశాలమ్మా !
లొట్టిలన్నిపోతే నేం పాశాలమ్మా !
దొప్పసితికి పోతేనేం పాశాలమ్మా !

అన్ని రాగాలాపం నేయసాగినాడు. జవ్వని "అంత ఎత్తులేను బావా !" అంది. "నా నడుంపట్టుకో ఎగిరిపోతాం" అన్నాడు పయిడయ్య. "నా తొమ్మ్మ కుండలు దిగనాగుతా యేమో పైడయ్యబావా !" అంది జవ్వని. "నీ మోవితీపి కై పెక్కించే నేవ్" అన్నాడు పైడయ్య. ఇలాగ్గా సరాగంమీద సరాగం, పరాసికంమీద పరాసికం ఆడుకుంటూ కిందామీదా పడుతూన్న దోసందులో చంద్రుడు మళ్ళీ మబ్బులలో పడిపోయి నాడు. ఆ సంగతి తెలియకుండా పయిడయ్యా పాశాలమ్మా వళ్లు మఱిచి ఒకళ్ళనొకళ్లు కౌగిలించుకు నిదరోయినారు.

అర్ధరేత్రి చీకటి గుయ్యారంగా వుండిపోయింది.—వేసంగిలో కురిసినవాన కాబట్టి నేల ఆరిపోయింది. గాలి ఆవిరిగా బయలుదేరింది. వరదులూ, అసురులూ సంచారం ప్రారంభించేయి. మధ్యమధ్య దేవతలూ దయ్యాలూ కనబడసాగినయి. ఎవరికి ? వొళ్ళుతెలిసిన వారికి. ఒళ్ళు తెలియనివాళ్ళకు ? ఒకటేనిద్ర.

నిద్రపోతూవున్నా నిద్రపోతూవున్న వాళ్ళను భద్రంగా చూచే దేవత భాగ్యదేవతవుంది ఆ వనంలో. వాళ్ళనే పాడు చెయ్యాలనిచూచే దరిద్రదేవతావుంది ఆ వనంలో.

ఆ యిద్దఱూ సంచారంలో ఆ రాత్రి కలుసుకొని ఒకరి ప్రతాపం ఒకరితో చెప్పుకుంటూ యీ నిద్రపోతూవున్న పైడయ్యా పాశాలమ్మగార్ల పడక దగ్గఱకు వచ్చినారు.

ఒకరికి తెలియకుండా ఒకరు, బాగుచేదామని భాగ్యదేవతా పాడుచేదామని దరిద్రదేవతా పన్నాగాలు పన్నుతూవున్నారు.

దరిద్రదేవత కల్లుదొప్పను తీసుకువచ్చి పాతినగునపానికి కిరీటంగా పెడతానంటుంది. భాగ్యదేవత గునపం పుచ్చుకు కల్లు దొప్పను చీల్చిపారేస్తానంటుంది. ఇద్దరికీ పెద్దకయ్యం ప్రారంభ మైంది. కల్లుదొప్పకు తగలకుండాతీసి ఇనపగునపాన్ని బంగారు బిడ్డీగాచేదామని భాగ్యదేవత తలంపు. ఏలాగన్నా కల్లుదొప్ప గునపానికి తగిలించి ఇనపగునపాన్ని చీపురుపుల్లగా చేసేదామని దరిద్రదేవత చలపట్టు. ఆ దేవతలయిద్దరి పరస్పరార్భాటానికి కలగనిలేచిన వాళ్ళకుమల్లే పైడయ్యా, పాశాలమ్మా మేలు కున్నారు. దేవతలిద్దరూ చెరియొక వైపునకు పారి పోయినారు.

పైడయ్య చుట్టూచూచి "ఎవరూలేరు" అన్నాడు. "లేక పోవడమేమిటి? ఇద్దరాడోళ్లు కజ్జా ఆడుకుంటూవున్నట్టయితేనే" అంది పాశాలమ్మ. "నీకు అవితే నా కొచ్చిన కల్లాంటికలే వచ్చిందే" అన్నాడు. "అది కలేఅంటావా?" అంది పాశా లమ్మ. "కాకపోతే మనుష్యులేరీ?" అన్నాడు పైడయ్య. పాశాలమ్మ అంది "అపరేత్రి తిరిగింది. నేనింటికిపోతా" నంది. పైడయ్య అన్నాడు "కోడికూసేవేళ నేనూవెళ్ళిపోతా, నీచేతి కల్లీయేళ సవిసూణ్ణిచ్చినావుకాదు కందా?" అన్నాడు పైడయ్య. "నేనేంచేసీది బావా! గాలిదుమారంవచ్చింది" పాశాలమ్మ. ఒకరిమీదొకరొరిగి ఒదిగి పడిపోయి వీడ్కోలు గొన్నారు. పయిడయ్య నిదరబడ్డాడు. పాశాలమ్మ వెనక్కి చూస్తూ "ఉంటే తాగిపోతా డీసాయంకాలం." అని తనకాళ్ళముందున్న కల్లుదొప్ప తీసి వాని గునపాన్ని తగిలించి చక్కాపోయింది.

"నే చేసేపని అదేచేసింది." అంది దరిద్రదేవత. అని అష్టే మంత్రించింది. ఇనపగునపం కఱ్ఱముక్క అయిపోయింది. భాగ్యదేవత సిగ్గుపడిపోయి నిష్క్రమించింది. దరిద్రదేవత చంకలు కొట్టుకొంటూ గంతులు వేసింది.

తెల్లవాఱగట్ల కోడికూసేతలికి పైడయ్యలేచేడు. చుట్టూ చూచి గునపంకోసం వంగున్నాడు. అది కఱ్ఱగావుంది. ఆ కఱ్ఱ నోదొప్పవుంది. "ఓరి దీంతగలెయ్య! పాశాలమ్మకాదులాగుంది. పిశాచం అనుకుంటాను. నా గునపం! నా పనిముట్టు! నా జీవన సాధనం!" అనుకుంటూ ఆ కఱ్ఱ ఆ దొప్పా పుచ్చుకుని తిన్నగా ఊళ్లోకి గవళ్ళగూడెంలోకి పరుగెత్తేడు.

పరుగెత్తి పాశాలమ్మవున్న యింటితలుపు కొట్టేడు. "పాశాలమ్మా? పాశాలమ్మా!" అన్నాడు. "ఓయి వెళ్ళలే పైడయ్యబావా!" అంది పాశాలమ్మ. "ఇల్లారా" అన్నాడు పైడయ్య, "నన్నింత మోసం చేస్తావా?" అన్నాడు. అని కఱ్ఱాదొప్పా చూపించేడు. "నా గునపం పట్టుకుపోతావు?" అన్నాడు. పాశాలమ్మ అంది "అలాంటి పాడుమాటలు అన్నావా అంటే నాకాలి ఆకుజోడు దవడాత్తది" అని. సిగ్గుపడిపోయేడు పైడయ్య. "బాకీడబ్బులుంటే రామట్టుకోవాలిగాని మోసంగా నాకాడతొంగుని దొంగపనిచేస్తావా?" అని అనుకొన్నాడు లోలో పైడయ్య. ఆ ముక్కలువింది పాశాలమ్మ. "నీవేం బాకీలేవు బావా! వెళ్లు, వెళ్లు." అంది పాశాలమ్మ. అంటూ తలుపు వేశేసుకుంది "తోట్లో పరువళ్లు వూళ్లో త్రొక్కకు తన్నులు తినేవు" అంది తలుపుసందులోంచి చూస్తూ.

"కఱ్ఱా, దొప్పా పైడయ్య చేతికొచ్చినయి. మాయంటే మాయ" అనుకున్నారు ఆంతాను. భాగ్యదేవత వాక్కర్తి

మాత్రం "వాడికర్మ వాణ్ణేకుడిపింది" అని అనుకుంది. ఎంచేత? తన శాయశక్తులా తంటాలు పడింది, కల్లుదోప్ప పాటుపడే గునపానికంటరాదని. కాని సహవాసదోషం తప్పించడానికి సాధ్యంకాక పోయింది, భాగ్యదేవతకైనాను.

పైడయ్యకు మళ్ళీ కల్లోసినవాళ్ళూ లేరు కలోసినవాళ్ళూ లేరు–పాపం!

.... .... .... .... ....

## అసంతృప్తి ఆనందం

రస్తా వెడల్పిచ్చింది. తుడిచేవాళ్ళు సంఖ్యలో ఎక్కువైనారు. రస్తారాటు హెచ్చైంది. తుడిచేవాళ్ళు కొత్తగా దిగుమతి అయినారు. అయితే లోకంలో అసంతృప్తి? అది అలాగేవుంది. నడిచేవాళ్లు తుడిచేవాళ్ళతోను, తుడిచేవాళ్లు నడిచేవాళ్ళతోను ఎంత కలిసిపోతూవున్నా ఆదిసమస్య ఆదిసమస్యగానే నిల్చివుంది.

ఆదిసమస్య అనగా ఆకలిసమస్య–"శిశువు కేరుమనడంతోనే తల్లి అక్కునచేర్చుకు పాలు అందిచ్చేటట్టు అందరియొక్క అందుబాటులోను భగవంతు "డున్నాడు! ఉన్నాడు!" అని ప్రతి మతము ప్రతి మార్గదర్శి ప్రకాశమానంగా పలకడమేగాని పరీక్షయిచ్చిన వాడు వొక్కడూ లేడు. మనందరుకూవున్నా వాళ్ళకులేడు. వాళ్ళకు భగవంతుడూలేడు, భగవద్భ్రివక్తాలేడు. ఆ యుభయం లేమితో పాటు ఇహభయంలేదు పరభయంలేదు. కాని అహంజ్యోతి? అది ఎవనిలో వానికే ఆ గుంపులో ఆ యుదయం తొణికిసలాడి పోతూవుంది. ఈ తుడిచేది తాను